
# నవభూమి

## జిల్లా అనుబంధం

25 జూన్ ,2025 బుధవారం పేజీలు:9

www.epaper.navabhoomi.in

# కలెక్టర్ గారు గుండాల ప్రభుత్వ పాఠశాలను
# కాస్త పట్టించుకోరూ!

- కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వ ప్రాధామికోన్నత పాఠశాల
- జిల్లాలో టాయిలెట్స్, మంచినీళ్ళు లేని ఏకైక పాఠశాల

మరమ్మతులు పేరిట లక్షలు గోల్ మాల్

- జిల్లా ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపం

పేద విద్యార్థులకు శాపం







**వూకె రామకృష్ణ / గుండాల జూన్ 24 నవభూమి ప్రతినిధి:** గుండాల మండలంలో ఉన్న ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాలలో కనీస సౌకర్యాలు నోచుకోకుండా విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఈ పాఠశాలలో వేలాది మంది విద్యార్థులు ప్రాధమిక విద్య అభ్యశించి ఎంతో మంది ఉద్యోగాలు పొందారు. అంత ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలలో నేడు ఎన్నో ప్రభుత్వాలు వచ్చిన కూడా ఈ గుండాల మండల కేంద్రంలో ఉన్న ఈ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల కనీస సౌకర్యాలు లేక శిదిలావస్థకూ చేరుతూ కనీస సౌకర్యాలు లేక వెలవెల పోతుంది. జిల్లాలో అన్ని పాఠశాలలో మూత్రశాలలు ఉన్నప్పటికీ గుండాలలో మాత్రం పాఠశాలలో టాయిలెట్స్ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయూనీలు చాలా ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఈ పాఠశాలకు కనీసం మంచినీళ్లు సౌకర్యం కూడా లేక పక్కన ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ లో బోర్ వద్దకు విద్యార్థులు వెళ్లి చేతులతో మంచి నీళ్లు త్రాగే పరిస్థితి ఉన్నది. మధ్యాహ్నం భోజనం చేసిన విద్యార్థులు ప్లేట్ లు పట్టుకొని దూరంగా ఉన్న బోర్ వద్దకు వెళ్లి ప్లేట్ లు కడుక్కొని మంచినీళ్లు త్రాగి రావాల్సిన దుస్థితి నేడు నెలకొన్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కరెంట్ లేని పాఠశాల, ఫ్యాన్ లేని పాఠశాల, గోడలకు సున్నం లేని ఏకైక పాఠశాలగా వెలవెల పోతూ విద్యార్థులను ఉపాధ్యాయులను వెక్కిరిస్తుంది. ఇంత దారుణంగా ఈ పాఠశాల కొనసాగుతూ ఉంటే మండల ఉన్నత అధికారులు జిల్లా ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేకుండా నిమ్మకు నీరెత్తి నట్లు నిర్లక్ష్యంగా ఉండటంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ఇలాంటి కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను ఏవిధంగా పంపాలని ఎదురు ప్రశ్నించడం ప్రారంభించారు. గతంలో పాఠశాల మరమ్మతులు పేరిట కనీస సౌకర్యాలు పేరిట 25 లక్షలుతో పనులు ప్రారంభించినా కూడా పూర్తి చేయకుండా అసంపూర్తిగా ఉండటంతో కనీసం గోడలకు తెల్లటి సున్నం కూడ లేకుండా భూత్ భంగ్లాలా కనిపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఈ పాఠశాలపై అనాసక్తి తో ఉంటున్నారు. పాఠశాల మరమ్మతులు పేరిట లక్షలు కాంట్రాక్టర్ లు అధికారులు కలిసి దోచుకొని తిన్న కూడా అడిగే నాధుడు లేడు. జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో చదివే దళిత గిరిజన బడుగు బలహీన వర్గాల పిల్లలు భవిష్యత్తు ఏమి కావాలని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాల సమస్యలపై నిధులు గోల్ మాల్ పై ఆదివాసీ సంఘాలు అతి త్వరలోనే జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేయాలనే ఆలోచనలో ఉన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన
# అందరి బాధ్యత

### అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు










**ఖమ్మం క్రైం, నవభూమి, జూన్ 24:** మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్ ఆర్ జూనియర్ కాలేజ్, ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో స్లోగన్ రైటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. నినాద రచన పోటీలలో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు అలవాటుపడి యువత తమ మేధాశక్తిని వృథా చేసుకోకూడదన్నారు. డ్రగ్స్ ఒకసారి వాడినా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజా యి, డ్రగ్స్ వినియోగాన్ని యూత్ సోషల్ స్టేటస్, ఫ్యాషన్గా ఎంచుకుంటోందని, దీనిద్వారా విలువైన జీవితాలు నష్టపోతారని ఆయన అన్నారు.

సహనం కోల్పోయి ఇతరులపై దాడులు, హత్యలు, దొంగతనాలాంటి నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. స్కూళ్లు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకుంటున్నా, విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఏఎన్ బి డీఎస్పి శ్రీధర్, సీఐ విజయ్, ఖమ్మం ఆర్బన్ ఇన్స్పెక్టర్ భానుప్రకాశ్ పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో
# ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### మాదకద్రవ్యాల నివారణా వారోత్సవాల పోస్టర్లను విడుదల చేసిన ఎస్పీ రోహిత్ రాజు





**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:**యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యసాధనకై కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ పోస్టర్లు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం పై దుష్ప్రభావాలు, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ జిల్లా పోలీసు శాఖ తరఫున నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.యువత, విద్యార్థు లు మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ అమూల్య జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కా వాలన్నారు.జిల్లాలో ఎక్కడైనా గంజా యి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.అనంతరం మిషన్ పరివర్తన్ మాదక ద్రవ్యాల సమాజ నిర్మూలనే లక్ష్యంగా తయారు చేసిన పోస్టర్లను ఆవిష్కరించి, డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ సైనికుల వలె పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, సీఐ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, 1టౌన్ సీఐ కరుణాకర్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము, జూలూరుపాడు సీఐ ఇంద్రాసేనారెడ్డి, అశ్వారావుపే ఎట సీఐ నాగరాజు రెడ్డి,ఆర్ఐలు నరసింహారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రిలో ఆందోళన

**ఖమ్మం-నవభూమి:** ఖమ్మం జిల్లా ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె రోజురోజుకూ ఉధృతంగా మారుతోంది. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య ధోరణి, ముగ్గురు మంత్రుల అలసత్వం, వైద్యాధికారుల మొండితనంతో విసిగి వేసారిన 259 మంది వేతన జీవులు ఆకలి కేకలతో ప్రాంగణాన్ని హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా దవాఖాన ఎదుట దీక్షకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



చేతిలో చిల్లిగవ్వ లేక ఇంటిల్లిపాది ఆకలితో అలమటిస్తున్నా మని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.ఆ క్రమంలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు మున్సిపల్ కార్మికులు అక్కడికి చేరుకోవడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

# అమెరికా యుద్ధ కాంక్ష వల్లనే ప్రపంచంలో అశాంతి

## ఖమ్మంలో వామపక్షాల నిరసన



**ఖమ్మం నవభూమి జూన్ 24:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యుద్ధ పీపాసి అని ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తూ ఇరాన్పై దాడికి తెగబడ్డాడని వామపక్షాల నేతలు ఆరోపించారు. కేవలం ఆయుధ వ్యాపారం కోసమే అమెరికా ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తుందని అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతో ప్రపంచ పోలీసులా వ్యవహరించాలని ప్రయత్నిస్తుందని వారు ఆరోపించారు. మంగళవారం సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్న్, సిపిఐ(ఎంఎల్) -న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు సిపిఐ కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల నేతలు మాట్లాడుతూ ఇరాన్పై అమానుషంగా దాడి చేస్తుందని గాజాపై ఇజ్రాయిల్ దాడిని సమర్థించడమే కాకుండా స్వయంగా ఇరాన్పై దాడికి పాల్పడడం సామ్రాజ్యవాద కాంక్షలో భాగమేనన్నారు. ప్రపంచ శాంతికి అమెరికా భంగం కలిగిస్తున్న భారత ప్రధాని మోడీ మౌనంగా ఉండటం పరోక్షంగా ట్రంప్ను సమర్థించడమేనన్నారు. గాజాలో మహిళలు, పసిపిల్లలు అని చూడకుండా ఇజ్రాయిల్ వరుస దాడులు చేస్తుందని దీనిపైన భారత్ తన వైఖరిని స్పష్టం చేయలేదని వారు దుయ్యబట్టారు. ప్రపంచంలో అశాంతి నెలకొనడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడనున్నారని వారు తెలిపారు. అంతర్జాతీయ చట్టాలను లెక్కచేయకుండా ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తున్న అమెరికా వైఖరిని యావత్ ప్రపంచం ఖండించాలని వారు -విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియా దేశాలపై ఆధారపడిన భారత్ లాంటి దేశాలకు ఇబ్బంది కలగనుందని వారు తెలిపారు. భారత్ అలీన విధానాన్ని కాదని అమెరికా, ఇజ్రాయిల్ అనుకూల విధానాన్ని పాటిస్తుందని దీనిని -విడనాడి యుద్ధాన్ని ఆపడానికి భారత్ ప్రయత్నించాలని వామపక్షాల నేతలు కోరారు. సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు బాగం హేమంతరావు, దండి సురేష్, నున్నా -నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వర్లు, ఝాన్సీ, జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, వై. విక్రం, శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి పద్మ, యర్రా శ్రీను, రావి శివరామకృష్ణ, మంగతాయి, పగడాల మల్లేష్, మేకల శ్రీను, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

### ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించిన

# మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్

## న్యూఢిల్లీ (మోట) ప్రత్యేక అధికారి సుభాష్





**భద్రాచలం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** తాతల కాలం నుండి పాటిస్తున్న గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు అంతరించిపోకుండా నేటితరం గిరిజన యువతి యువకులు తెలుసుకొని ఆచరించి కాపాడుకునే విధంగా గిరిజన మ్యూజియంను తయారు చేయడం సంతోషకరమని మినిస్టరీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ న్యూఢిల్లీ (మోట) ప్రత్యేక అధికారి సుభాష్ అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ ప్రత్యేక అధికారి భద్రాచలం డివిజన్లో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం నాడు ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం ను ఆయన సందర్శించి మ్యూజియంలోని కళాఖండాలు పెయింటింగ్ చిత్రాలు డ్రైవర్ వంటకాలను ఆస్వాదించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటకులకు కనువిందు కలిగేలా ట్రైబల్ మ్యూజియంను రూపొందించి పాత తరం గిరిజనులు వాడుకునే వస్తువులు మరియు ధరించే ఆభరణాలు చాలా బాగున్నాయని, మ్యూజియంలోని ప్రతి కళాఖండాలు సహజత్వం ఉట్టిపడేలా ఉన్నాయని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో రెండు రోజులు పర్యటన చేసి దేవాలయాలతో పాటు మ్యూజియంను కూడా సందర్శించడం వలన మంచి అనుభూతి కలిగిందని, కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు సక్రమంగా అందుతున్నాయని అందుకు ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు. అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తన ఛాంబర్ లో కలిసి గిరిజన గ్రామంలో గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించిన అనంతరం పిఓ వారిని సన్మానించి జ్ఞాపకను అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

## ■ ఎంఈఓ ప్రసాదరావు



**అశ్వారావుపేట టౌన్ జూన్ 24 నవభూమి:** విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించుటకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలనీ బేస్లైన్ టెస్ట్ నిర్వహించాలని మండల విద్యాధికారి పి ప్రసాదరావు అన్నారు. స్థానిక దొంతికుంట ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ప్రార్థనా సమయానికే పాఠశలకు చేరుకొని ప్రార్థన జరిగే విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను, హాజరును రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులలో పోటీతత్వం పెరగాలని పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని విద్యార్థులలో ఉన్నత సామర్థ్యాలు పెంపొందేలా కృషి చేయాలని ఆయన అన్నారు. వీరితో పాటు సి ఆర్ పి ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ విజయోత్సవ పండుగను ఘనంగా నిర్వహించాలి

## జిల్లా ఇన్చార్జ్ కందకట్ల విజయ మాదిగ



**చింతకాని, చింతకాని, నవ భూమి, జూన్ 24:** ఎమ్మార్పీఎస్ విజయోత్సవానికి సంకేతంగా జులై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ విజయోత్సవానికి సంకేతంగా జండా పండుగను ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ కందగట్ల విజయ మాదిగ సూచించారు. మంగళవారం మండల పరిధిలో లచ్చగూడెం గ్రామంలో మండలం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమీక్ష సమావేశం లచ్చగూడెంలో నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకాని మండలంలో అన్ని గ్రామాల్లో తక్షణమే గ్రామ కమిటీలు నిర్వహణ చేయాలని, అలాగే ఎమ్మార్పీఎస్ గద్దెలు లేని గ్రామాలను తక్షణమే ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గద్దెల నిర్మించాలని గ్రామ నాయకులకు ఆదేశించారు. జూలై 7న వర్గీకరణ సాధించుకున్న తర్వాత కృష్ణ మాదిగ పోరాట ఫలితానికి, ఎమ్మార్పీఎస్ విజయోత్సవానికి సంకేతంగా జూలై 7న ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణలతో పాటు కృష్ణ మాదిగ పుట్టినరోజును అంగరంగ వైభవంగా జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్రా ఉపేందర్, మండల ఎం ఎస్ పి అధ్యక్షుడు కట్టా వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు చాట్ల రాజేష్ మాదిగ, వేర్పుల హరికృష్ణ, కుక్కల దిలీప్, కుక్కల శ్రీకాంత్, తుంగ ఆదం, జలపల్లి మధు, పగిడిపల్లి నాగేశ్వరరావు, గద్దల మహేష్, పగిడపల్లి శివ, గుర్రం రాజేష్, సంపంగి బాలకృష్ణ, గుండె జాని, పల్లె పోగు వెంకటేశ్వర్లు, కొల్లి నాగయ్య, తుంగ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# టూ టౌన్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల ను స్టేషన్ కు పిలిపించి, అనవసరమైనటువంటి కొట్లాటలలో, భూ తగాధల విషయాలలో గాని రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్లలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైనటువంటి చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ఆటోయూనియన్ ఏకగ్రీవ ఎన్నిక



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 24:** మండల కేంద్రం ఎరుపాలెం రైల్వే స్టేషన్ కూడలి సిఐటియు ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నికను మంగళవారం నిర్వ హించుకున్నారు.

ప్రెసిడెంట్గా ఎర్రుపాలెం గ్రామానికి చెందిన అద్దంకి బాలరాజు,వైస్ ప్రెసిడెంట్గా బనిగండ్లపాడు గ్రామానికి మోదుగుజోజి,కోశాధికారిగా మామునూరు గ్రామానికి చెందిన కొత్తపల్లి జగదీష్, కార్యదర్శిగా ఎర్రుపాలెంగ్రామానికి చెందిన గుడేటి మోహన్ రావు,ఇనపనూరి కమలా కర్ లను ఏకగ్రీవంగాఎన్నిక చేసుకున్నారు .నూతనంగాఎన్నికైన కమిటీని సిఐటియు నాయకులు అభినందించారు.

# సరస్వతీ పుత్రుడు చలపతిరాజు

## ■ఉపాధ్యాయుడిగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీర్తి
## శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు మార్గదర్శకుడు



కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి: గత మూడున్నర దశాబ్దాలుగా సైన్స్ రంగానికి ఎన్నో విధాలుగా సేవ లందించి, విద్యార్థులను శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల కార్యోన్ముఖులను చేసి సమాజానికి ఎంతోమంది సేవకులను అందించిన సరస్వతి చలపతి రాజు ను పలువురు అభినందిస్తున్నారు. దశాబ్దం పాటు జిల్లా సైన్స్ ఆఫీసర్ గాను, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ గాను, ఎన్సీఎస్సీ గా పనిచేసి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థుల మనసుల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారు. ఒకవైపు ఉపాధ్యాయుడిగా, గైడ్ టీచర్ గా వ్యవహరిస్తూ మరోవైపు జిల్లా సైన్స్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ తన సత్తాను చాటుకున్నారు. ఈనెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న చలపతిరాజు మా నవభూమి ప్రతినిదితో ఆయన అభిప్రాయాలను పంచుకున్నారు.

**ప్రశ్న: ఉపాధ్యాయులు అందరు మాదిరిగానె మీరు బోధనకే పరిమితం ఎందుకు కాలేదు?**


జవాబు: ఉపాధ్యాయ వృత్తి అనేది కేవలం గదిలో నాలుగు గోడలకే పరిమితం కావడం ఇష్టం లేదు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిన దిద్దిన వాడే టీచర్. సామాజిక రంగాలు, అభివృద్ధిలో, సేవలో, పాల్గొనే అవకాశం ఒక్క టీచర్ కు మాత్రమే లభిస్తుంది. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి మార్గాన్ని ఎంచుకున్నాను. నాకు ఈ విషయంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయి. అయినా వాటిని అధిగమించి నా లక్ష్యం వైపే ప్రయాణించాను. కేవలం బెల్లు, బిల్లు, సమయానికే బడికి రావడానికే పరిమితమైతే జీతం తప్ప ఏది రాదు. విద్యార్థులను సంపూర్ణంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కరికులం, కో- కరికులం యాక్టివిటీస్ లో విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యానికి కట్టుబడి ఉన్నాను.

**ప్రశ్న: కేవలం విద్యార్థులను మాత్రమే శాస్త్ర రంగాల వైపు కార్యోన్ముఖుల్ని చేశారా? ఏమైనా సైన్స్ ఆక్టివిటీస్ లో మీరు పాల్గొన్నారా?**

**జవాబు:** సైన్స్ కేవలం చెప్పడానికే పరిమితం కారాదు. ఉపాధ్యాయుడు ఎప్పుడూ అభ్యాసకుడే. నిత్యం ఆర్జించిన జ్ఞానం ఇతరులకు పంచడానికి వీలు కలుగుతుంది. ఏదో టెస్టు పుస్తకంలోని విషయాలు బోధిస్తే టీచర్ కాదు. ఉప పాఠ్యాంశాలతో పాటు అనుబంధ అంశాలు, నూతన విషయాలు, బోధించడం వల్ల విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి ఉపయోగపడుతుంది. నేను అనేక రకాల సైన్స్ రంగాలలో పాల్గొన్నాను. నాతో పాటు విద్యార్థులను కూడా అదే స్థాయిలో తీర్చిదిద్దాను. నిత్యం పాఠ్యాంశాలలోని పలు అంశాలపై చర్చిస్తూ, సామాజిక సమస్యలపై ఆలోచనలు కలిగించే విధంగా చేశాను. దీని ద్వారా సామాజిక సమస్యలపై విద్యార్థుల్లో ఒక రకమైన ఆలోచనకు పునాది వేసినట్లు అవుతుంది. ఇది సైన్స్ ఫెయిర్, ఇన్స్పైర్, బాలల సైన్స్ కాంగ్రెస్ ద్వారా అవగాహన కలిగించడం జరుగుతుంది.

**ప్రశ్న: మీ వృత్తితో పాటు ఇతర శాస్త్ర రంగాల్లో పాల్గొన్నారా?**

**జవాబు:** నేను ఉపాధ్యాయుడుగా బోధనకే పరిమితం కాకుండా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సైన్స్ పోటీల్లో పాల్గొన్నారు. 1993లో మొదటిసారిగా ఎన్సీఈఆర్టీ న్యూఢిల్లీ వారు నిర్వహించిన పాఠ్య ప్రణాళిక రూపకల్పన పోటీల్లో పాల్గొన్నారు. 2003లో భోపాల్ లో జరిగిన జాతీయ సైన్స్ ఉపాధ్యాయ కాంగ్రెస్ పోటీలలో పాల్గొని







మొదటిసారిగా బంగారు పతకం పొందాను. ఆ తరువాత 2004లో ఉజ్జయినిలో జరిగిన పోటీలలో కూడా బంగారు పతకం సాధించడం విశేషం. 2005 నుంచి వరుసగా 8సార్లు నేషనల్ టీచర్స్ సైన్స్ కాంగ్రెస్ లో పాల్గొన్నాను. సైన్స్ ఉపాధ్యాయుడిగా వరుసగా పది సంవత్సరాలపాటు పాల్గొని దేశంలోనే రికార్డు సృష్టించాను. ఎన్సీఈఆర్టీ న్యూఢిల్లీ వారు ఏర్పాటు చేసిన సెమినార్సులో మూడుసార్లు నా పేపర్స్ ఎంపికయ్యాయి. ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ తో పాటు 8సార్లు జాతీయ సైన్స్ కాంగ్రెస్ కు నా పరిశోధన పత్రాలు ఎంపికయ్యాయి. విద్యాపరంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో కూడా రిసోర్స్ పర్సన్ గా పని చేశాను. ఎన్ ఆర్ ఐ మైసూర్, ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ హైదరాబాద్, భువనేశ్వర్, హర్యానా, బనారస్ హిందూ యూనివర్సిటీ వారణాసి, మణిపూర్, ఐసర్ యూనివర్సిటీ పూణే,అన్న యూనివర్సిటీ చెన్నై, తదిత రాష్ట్రాల్లో జరిగిన జాతీయ సైన్స్ కాంగ్రెస్, టీచర్ సైన్స్ కాంగ్రెస్ లోనూ పాల్గొన్నారు అనేక ఆర్టికల్స్ రాశాను. కనువిప్పు కరోనా అనే పుస్తకాన్ని సామాజిక స్పృహ కలిగించే పుస్తకాన్ని రాశాను.

**ప్రశ్న: మీ గైడెన్స్ లో విద్యార్థులు ఏ స్థాయికి ఎదిగారు?**







**జవాబు:** 1987 - 88లో ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఏన్కూర్ లో విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్లో మూడు ప్రథమ బహుమతులు లభించాయి. ఇది నా జీవితానికి మొదట సారిగా స్ఫూర్తి కలిగించిన అంశం. అనేకమంది ఎన్నారైలు గాను డి ఆర్ డి ఓ, లోను, ఐఓసీ లోను, సైంటిస్టులుగా పని చేస్తున్నారు. అదేవిధంగా సివిల్ సర్వీస్, రాష్ట్ర సర్వీస్లలో పలువురు ఉద్యోగాలు పొందారు. జిల్లాలో బాల శాస్త్రవేత్తగా పాల్వంచకు చెందిన డాక్టర్ కే లక్ష్మారెడ్డి కూతురు కే సింధు జాతీయ స్థాయిలో ఎంపికై అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నుంచి ప్రశంసలు అందుకున్నది. ఆ తర్వాత బాలల సైన్స్ కాంగ్రెస్, ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్, ఇంటింటా ఇన్నోవేషన్, స్కూల్ ఇన్నోవేషన్, సైన్స్ డ్రామా, నేషనల్ గ్రీన్ కార్ప్స్, ఎన్ జి సి తదితర అంశాలలో జిల్లాకు చెందిన అనేకమంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు, పతకాలు అందుకున్నారు.

**ప్రశ్న: మీ 35 సంవత్సరాల సర్వీసులో ఏమైనా అవార్డులు, రివార్డులు అందుకున్నారా?**

**జవాబు:** నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా చేరిన అనతి కాలంలోనే రెండుసార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నాను. 1993లో జిల్లా స్థాయిలోనూ, 2007లో రాష్ట్ర స్థాయిలో నేషనల్ ఫౌండేషన్ అవార్డు బంగారు పతకం, నగదు, బహుమతి ని అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నాను. 2016 -17 లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ సైన్స్ టీచర్స్ కాంగ్రెస్ పోటీల్లో రెండు బంగారు పథకాలు. 2018లో హెూమీబాబా అవార్డు జార?ండ్ సైన్స్ అకాడమీ నుంచి, 2023- 24 లో పద్మశ్రీ నందమూరి ఎన్టీ రామారావు అవార్డును అందుకున్నాను. పదిసార్లు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ నుంచి అవార్డు అందుకున్నాను. ఉత్తమ సైన్స్ ఆఫీసర్ గా అనేకసార్లు గుర్తింపు పొందాను. ఇక్కడ అవార్డులు, రివార్డులు ముఖ్యం కాదు. నావల్ల విద్యార్థులకు, సమాజానికి, ఎలాంటి మేలు జరిగిందనేది ముఖ్యం. గుండె మీద చేయి వేసుకొని విద్యార్థులను ఏ ఏ స్థాయికి ఎదిగారో చెప్పగలిగిన వాడే నిజమైన ఉపాధ్యాయుడు. ఫలనా టీచర్ వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను అని చెప్పే విద్యార్థుల సంఖ్య పైనే మనకు ఆనందం కలుగుతుంది. అవార్డు అనేది ఒక్కరోజు మాత్రమే చెప్పుకుంటాము. ఒక విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగితే ఆ మాట జీవితాంతం మిగిలిపోతుంది. ఇది ప్రతి టీచర్ గుర్తు పెట్టుకోవాల్సిన అంశం.

**ప్రశ్న: ప్రస్తుత విద్యా విధానం, ఉపాధ్యాయ వృత్తిపై మీ అభిప్రాయం ఏమిటి?**

**జవాబు:** ప్రస్తుత విద్యా విధానం ఊసరవెల్లిలా మారుతుంది. కాలానుగుణంగా విద్యా విధానం మార్పులు జరగాలి, కానీ ప్రతిసారి వచ్చిన పాలకులు విద్యా విధానాన్ని మార్చరాదు. నిధులు కేటాయింపులకు అనుగుణంగా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మార్పులు చేస్తే విద్యా ఫలాలు నిరుపయోగంగా మారుతాయి. భారతీయ సంస్కృతి, మానవ శారీరిక వికాసం, మానసిక వికాసం, సామాజిక అభివృద్ధికి అనుగుణంగా విద్యా విధానం ఉండాలి. ఎలాంటి పుస్తకాలు, అభ్యాసన సామాగ్రి లేని సమయంలో భారతీయ విద్యా సంస్థలు, విద్యా విధానం ప్రపంచంలోనే అగ్రగామిగా ఏ విధంగా ఉన్నదో ఆలోచించాల్సిన విషయం. నేడు అన్ని రకాల నిధులు, విధానాలు, అభ్యాసన సామాగ్రి, శాస్త్ర సాంకేతిక రంగమైనటువంటి బోధనా విధానం ఉన్నప్పటికీ అనుకున్న ఫలితాలు సాధించలేదు. విద్యా విధానంపై సమగ్ర అవగాహన, విద్యార్థులకు బోధన పట్ల చిత్తశుద్ధి, విద్యార్థుల శక్తి సామర్థ్యాలను గుర్తించడం అనే వాస్తవాల పట్ల అవగాహన కలిగి ఉండాలి. కొన్ని వందల రకాల విద్యా సంస్థలు వెలిశాయి. ఒక్క ప్రభుత్వ పరిధిలోనే అనేక రకాల పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నడిపే పాఠశాలలో అన్ని సౌకర్యాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులు నియమిస్తే సరిపోతుంది. పర్యవేక్షణపై ఆధారపడే విద్యా విధానం సరైన ఫలితాలు ఇవ్వవు. ఉపాధ్యాయుడు నిత్య అభ్యాసకుడిగా ఉండాలి. అప్పుడే విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. మా టీచర్ కు సరిగా పాఠం చెప్పడం రాదు అని విద్యార్థుల మనసుల్లో పడితే ఆ విద్యా వ్యవస్థ తిరోగమన దశలో ఉంటుంది. ప్రతి సమస్యను తల్లిదండ్రులుపై, సమాజం పై, అధికారులపై, నెడితే పరిష్కారం జరగదు. రోజు 8 గంటల పాటు పాఠశాలల్లో ఉండే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏ విధంగా న్యాయం చేస్తున్నాము అనే విషయం పై ఆత్మ విమర్శ చేసుకోవాలి. సమస్య పరిష్కారానికి మార్గం వెతకాలి కానీ ఎదుటివారిపై రుద్దే స్వభావం, నా పని కాదు వేరే వారి పని ఇది అనే ఆలోచనలను విడనాడాలి. ప్రభుత్వం సమాజం నుండి మనకేం లభిస్తుందని ఆలోచన కంటే మనం ఏం చేస్తున్నామో అనేది ముఖ్యం. ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఒక లైబ్రరీ అనేది ఏర్పాటు చేసుకోవడం అవసరం. ఎందుకంటే ఉపాధ్యాయుడు నిత్య అభ్యాసకుడు.

# రైతు భరోసా విజయోత్సవ సభలు వట్టి బోగస్

## బిఆర్ఎస్ భద్రాచల నియోజకవర్గ ఇన్చార్జి మానే రామకృష్ణ



**భద్రాచలం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏం చేసిందని, ఏం ముఖం పెట్టుకుని విజయోత్సవ సంబరాలు చేస్తున్నారని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మానే రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఈ సంబరాలు స్థానిక సంస్థల ఎన్నికలు నడపడానికి ఈ యొక్క బూటకం ప్రజలను మభ్య పెట్టడం కోసం మాయమాటలతో ప్రజల్ని, రైతులని మళ్ళీ మోసం చేయడం కోసం రైతు భరోసా సంబరాలు చేసుకోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. గతంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ రైతుబంధు పథకం 11 సార్లు 80 వేల కోట్ల రూపాయలు తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి రైతుబంధు పథకం ద్వారా డబ్బులు చెల్లించడం జరిగింది. ఆనాడు కరోనా సమయంలో కూడా ఎమ్మెల్యేల జీతాలు కూడా బంద్ పెట్టి రాష్ట్ర ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఇబ్బందిగా ఉన్న కూడా రైతు బంధు పథకాన్ని ప్రతి సంవత్సరం రైతులకు డబ్బులు చెల్లించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈనాడు రైతులకి బేడీలు వేసినందుకా ఈ రైతు భరోసా విజయోత్సవ సంబురాలు.సన్న వడ్లకు బోనస్ ఇవ్వనందుకా ఈ విజయోత్సవ సంబరాలు. గత రెండుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టినందుకా ఈ విజయోత్సవ సంబరాలు. రైతులకు సంవత్సరానికి 15 వేల రూపాయలు ఇస్తాను అని చెప్పి 12 వేల రూపాయలకు కుదించి మాయ మాటలు చెప్పినందుకు ఈ విజయోత్సవ సంబరాలు. రైతులకు ఇచ్చిన మాటలను ఎగ్గొట్టినందుకు ఈ రైతు భరోసా విజయోత్సవ సంబరాలు రైతు బీమా పథకాన్ని పూర్తిగా ఎత్తివేసినందుకా ఈ రైతు భరోసా విజయోత్సవ సంబరాలు. దుర్మార్గపు కాంగ్రెస్ పాలనలో 500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా ఈ రైతు భరోసా విజయోత్సవ సంబరాలు. ఆనాడు కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా రైతులకు రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 60% మంది రైతులకు రుణమాఫీ కాలేదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు తక్షణమే క్షమాపణ చెప్పాలి. ఏ ముఖం పెట్టుకొని, ఈ విజయోత్సవ సభలు చేస్తున్నారని భద్రాచల నియోజకవర్గ ఇన్చార్జ్ మానే రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు.

### నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని

# జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె

## కార్మిక సంఘాల జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయం




**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధమైన నాలుగు లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని, ఇరవై తొమ్మిది కార్మిక చట్టాల అమలుకు సమరశీల పోరాటాలు తప్పవని,దానిలో భాగంగానే జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె కి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఈ పిలుపుని జిల్లా లో అత్యంత జయప్రదంగా నిర్వహించాలని సిఐటియు కార్యాలయంలో ఐ ఎన్ టి యు సీ జిల్లా అధ్యక్షులు జలీల్ అధ్యక్షతన జరిగిన అఖిల పక్ష కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జామలయ్య, టీ యూ సీ ఐ జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు సారంగపాణి, బిఆర్టీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ రెడ్డి లు తెలియజేశారు.రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి, కార్మిక భద్రత కి, సంక్షేమానికి అనేక పోరాటాలు చేసి కార్మిక చట్టాలను సాధించుకున్నారని అన్నారు. కార్మిక చట్టాలని కరోనా కాలంలో మోడీ ప్రభుత్వం మూజువాణి ఓటుతో పార్లమెంట్ లో మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చారని అన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలను సంతృప్తి పరచడానికి,వారి ఆదాయాలను మరింత రెట్టింపు చేయడానికి, కార్మిక వర్గం ముల్లులు పీల్చి పిప్పి చేయడానికి నాలుగు లేబర్ కోడ్ లను మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.ఇప్పటికే దేశం లోని బిజెపి పాలిత రాష్ట్రాలలో నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేస్తున్నారని, బిజెపి మిత్రుడుగా ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏడాది పాలను పూర్తైనా సందర్భంలో కార్మికులకు ఎనిమిది గంటల పని స్థానంలో పది గంటల పని దినాన్ని అమలు చేస్తున్నారన్నారు.కాంగ్రెసు పాలిత కర్ణాటక,రాజస్థాన్ లలో నాలుగు లేబర్ కోడ్ ల అమలుకు రంగం సిద్ధం చేశారన్నారు.ఏ ప్రభుత్వం అధికారం లో ఉన్నా, కార్మిక వర్గాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం తప్ప మరొకటి లేదన్నారు.కార్మిక చట్టాల పరిరక్షణ కొరకు జులై 9 న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ని జిల్లా అన్ని రంగాల్లో అత్యంత జయప్రదంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో సీఐటీయూ నాయకులు భూక్యా రమేష్,ఏఐటీయూసీ నాయకులు నగేష్,మల్లిఖార్జున్, కృష్ణ, బాలాజీ, ఐ ఎన్ టి యూ సీ నాయకులు కాలంగి హనుమాతరావు,శనగ రాంచందర్, టీ యూ సీఐ నాయకులు యం.చంద్రశేఖర్, ఇఫ్టు నాయకులు గిరి, మాధవరావు బి ఆర్ టియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి మండల రైతు వేదికలో రైతు భరోసాపై సంబురాలు







**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి , మంత్రులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతూ, అదేవిధంగా రైతు భరోసా నిధులు రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసి రైతన్నల మన్ననలను పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి, తొమ్మిది రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలలో రైతు భరోసా నగదును జమ చేసిందని మంగళవారం లక్ష్మీదేవిపల్లి రైతు వేదికలో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అంటే ఇప్పటివరకు 1 కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి అలాగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎంపీడీవో ఎలక్ట్రికల్ ఏఈ అగ్రికల్చర్ ఏ ఈ ఓ మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూజల శ్రీనివాస్, జిల్లా మైనార్టీ కార్యదర్శి ఎండి గౌస్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్సర్ ఖాన్, అజ్మీర మోహన్, ఖలీల్, ధరావత్ దుబ్బా, భూక్య సీతారాం ధారావత్ రమేష్ మండల రైతులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## మారుమూల వలస ఆదివాసి గ్రామాన్ని సందర్శించిన జిల్లా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ నరేందర్

### ఆదివాసిలకు దుప్పట్లు, చిన్న పిల్లలకు స్టడీ మెటీరియల్స్ అందజేత





**పాల్వంచ జూన్ 24 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ జి నరేందర్, పాల్వంచ సబ్ డివిజన్ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్ పాల్వంచ మండలం రూరల్ పరిధిలో లోని వలస ఆదివాసి గ్రామమైన మల్లారం గ్రామపంచాయతీ లోని మామిడికుంట గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఇందులో భాగంగా ప్రజలతో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ జి నరేంద్ర మాట్లాడుతూ వలస ఆదివాసీలకు, పోలీసు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు. అలాగే ఎలాంటి సంఘ విద్రోహశక్తులకు సహకరించకూడదని మావోయిస్టులకు సహకారం చేయకూడదని ప్రజలు అందరూ ప్రశాంతంగా జీవించాలని పోలీసు వారికి సహకరించాలని కోరారు. అదే విధంగా మావోయిస్టులకు సంబంధించిన సమాచారం పోలీసు వారికి అందించలన్నారు. అలాగే ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్న, కష్టాలు ఉన్న, పోలీసు వారికి చెబితే వారికి ఎల్లవేళలా పోలీస్ వారు సహకారం చేస్తారని భరోసా కల్పించారు. ఇందులో భాగంగా మామిడికుంట ఆదివాసి గ్రామ ప్రజలకు దుప్పట్లు అలాగే చిన్నపిల్లలకు స్టడీ మెటీరియల్స్ అందించారు. ఈ కార్యక్రమం లో పాల్వంచ రూరల్ ఎస్సై బి సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ



**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో పని చేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర చారి మంగళవారం జీవో విడుదల చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు విజ్ఞప్తి మేరకు ఈ జీవోను విడుదల చేశారు. ఈ కాపీని అందుకున్న వారిలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లోజి శ్రీనివాస్, ఎండి షఫీ, టెంజు జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు చంద్ర నరసింహా రావు, సాక్షి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో కృష్ణ గోవింద, సహాయ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, రాజ్ కుమార్, మన తెలంగాణ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ క్రాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కల్లోజు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# దేశాల మధ్య చిచ్చుపెడుతున్న అమెరికా

◆ యుద్ధాలకు స్వస్తి చెప్పి ప్రపంచ శాంతి నెలకొల్పాలి

◆ వామపక్షాల ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో నిరసన




కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి: పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యం చెలాయించడానికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దేశాల మధ్య చిచ్చుపెడుతూ, యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాడని, వామపక్ష పార్టీల జిల్లా నేతలు ఆరోపించారు. అఖిలభారత వామపక్ష పార్టీల దేశవ్యాపిత నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం నుంచి సిపిఎం కార్యాలయం మీదుగా బస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, సిపిఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇరాన్ దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడికి అమెరికా ప్రోత్సహించడమే కాకుండా ఆ దేశంపై స్వయంగా బాంబుదాడులకు పూనుకుందని ఇది అంతర్జాతీయ చట్టాలను ఖేఖాతరు చేస్తూ ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేవిధంగా అమెరికా పోకడలు ఉన్నాయన్నారు. తక్షణమే యుద్ధాలకు స్వస్తి చెప్పి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని, ప్రపంచదేశాలపై అమెరికా కర్రపెత్తనాన్ని కండించాలని నాయకులు పిలుపునిచ్చారు. అమెరికా తీరుపై ప్రధాని మోదీ నోరుమెదపకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని, అమెరికాతో చేయికలిపి యుద్ధాలను మోడీ ప్రోత్సహిస్తున్నాడా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, జక్కుల రాములు, నేరెళ్ల రమేష్, బోయిన విజయకుమార్, పి సత్యనారాయణాచారి, ధర్మరాజు, గుత్తుల శ్రీనివాస్, మూడ్ గణేష్, షాహీన్, షమీమ్, శాంతి, సిపిఎం జిల్లా నాయకులు లిక్కి బాలరాజు, లక్ష్మి, సిపిఐ ఎమ్మెల్ మాస్ లైన్ జాటోతు కృష్ణ, ఉమర్, గౌని నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ విద్యాసంస్థలను బ్యాన్ చేయాలి

◆ నారాయణ పాఠశాల ఎదుట ఆందోళనకు దిగిన ఏఐఎస్ఎఫ్

◆ నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ, యూనిఫామ్ అమ్మకాలపై విద్యాశాఖ అధికారులు స్పందించాలి

◆ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కె పహీమ్ ఖాన్

◆ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్‌లు ఉన్న రూమ్‌ను సీజ్ చేసిన ఎంఈఓ శ్రీరామ్ మూర్తి








పాల్వంచ జూన్ 24 నవభూమి ప్రతినిధి: అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ పాఠశాల గుర్తింపు ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పహీమ్ ఖాన్ డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ స్టేషనరీ పేరుతో బుక్ స్టాల్ ఏర్పాటు చేసుకొని లక్షలాది రూపాయలు విద్యార్థులు తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్న ఈ విషయంపై మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల ఎదుట బేటాయించి ఆందోళన నిర్వహించారు. విద్యార్థి సంఘం నాయకులు చరవాణి ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి కి సమాచారం అందించారు. స్థానిక ఎంఈఓ శ్రీరామ్మూర్తి పాఠశాల వద్దకు చేరుకొని స్టేషనరీ, పాఠశాల యూనిఫామ్ లు ఉంచిన రూమ్ ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పహీమ్ ఖాన్ మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టం తుంగలో తొక్కి అధిక ఫీజులు వసూలు చేస్తూ, విద్యార్థి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పేద విద్యార్థి తల్లిదండ్రులను ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఆసరాగా చేసుకొని కాసులు వసూలుకు పాల్పడుతున్న విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలని, విద్య హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ ఎస్టీ బీసీ వికలాంగులు పేద వర్గాల విద్యార్థులకు 25శాతం ఫీజ్ రాయితీ ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఈ నిబంధనలను నారాయణ పాఠశాల నిర్వాహకులు ఏ కోశానా అమలు చేయడం లేదన్నారు. (జీవో నెంబర్ 42)2010 ప్రకారం డొనేషన్లు క్యాప్టేషన్ ఫీజులు వసూలు చేయకూడదని, ఆట స్థలం తప్పనిసరిగా మున్సిపాలిటీ పరిధిలో 1000 చదరపు మీటర్లు ఉండాలని నిబంధనలు ఉన్నా ఆ నిబంధన తుంగలో తొక్కి తమ ఇ ష్టానుసారంగా వ్యవహరిస్తున్న, జిల్లా విద్యాశాఖ మాత్రం నిమ్మకు నిరత్తినట్టుగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని, విద్యాశాఖ అధికారుల అనుమతులతోనే అదనపు ఫీజులు వసూలు చేస్తున్నామని బహిరంగంగా యాజమాన్యం చెప్పడం వెనక ఆంతర్యం ఏంటని ఆయన ప్రశ్నించారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించి, పర్మిషన్ లేనటువంటి విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చెయ్యాలని, లేనిపక్షంలో దాడులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వర్క అజిత్, జిల్లా ఉపాధ్యక్షులు గుండాల సుజన, ఇనపల్లి పవన్ సాయి, నాయకులు అక్కినపల్లి నాగేంద్రబాబు, వినయ్, వంశీ, మహేష్, కళ్యాణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు**



చింతకాని, నవభూమి, జూన్ 24: అన్నదాతల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం రైతు భరోసా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా విజయోత్సవ సంబరాలు నాగులవంచ, లచ్చగూడెం రైతు వేదికల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజులలో 9,000 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క కు మండల రైతాంగం పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం18 నెలలో రైతు రుణమాఫీ,రైతు భరోసా,రైతు బోనస్లు అందించిన ఏకైక ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం అని కొనియాడారు. వ్యవసాయం అంటే పండుగని కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపించిందని స్పష్టం చేశారు. రైతు భరోసా, రుణమాఫీ ఉచిత విద్యుత్ అందిస్తూ రాష్ట్రంలోని రైతాంగాన్ని అన్ని విధాల కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటున్నందుకు రాష్ట్రంలోని అన్నదాతలందరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందని తెలియజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని అన్నదాతలు దగ్గరుండి సృష్టిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతులందరూ ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. అంతకుముందు రైతు భరోసా అందించినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలకు అన్నదాతలతో కలిసి మండల కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలోమండల కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, మండల నాయకులు తోటకూరి ప్రగతి,సట్టు వెంకటేశ్వర్లు, మడుపల్లి భాస్కర్ గౌడ్, కన్నెబోయిన గోపి, బందెల నాగార్జున, ఓర్సు వీరభద్రం, కంచుమర్తి రామకృష్ణ, బొర్రా ప్రసాద్ రావు, మనం చిన్నప్ప, తడికమళ్ళ రమేష్ ఎస్ కే పాషా, షేక్ సుభాని,వంగూరి రమేష్, ఎస్కే అబ్దుల్ మజీద్, పెంట్యాల అప్పారావు, తోటకూరి హరీష్, నారపోగు కొండల్ రావు, నూతనపాటి వెంకటేశ్వర్లు, షేక్ షాజహాన్, బండి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాల కొరకు ముఖాముఖీ



కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి: కొత్తగూడెం ఏరియా జి.యం ఎం. షాలేం రాజు ఆదేశాల మేరకు కారుణ్య నియామకాల కొరకు పద్మావతి ఖని మైన్ లో విధులు నిర్వహిస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మరణించిన ఉద్యోగుల వారసులు తొమ్మిది మందికి పద్మావతి ఖని ఏజెంట్ కార్యాలయంలో ముఖాముఖీ, వారి కుటుంబ సభ్యుల సాక్షుల సమక్షంలో నిర్వహించారు. కౌన్సిలింగ్ పూర్తయిన తరువాత అందరిని వైద్యపరీక్షల కొరకు పంపించి కంపెనీ నియమ నిబంధనలు అనుసరించి వారికి నియామక ఉత్తర్వులు అందజేయనున్నారు..ఈ కార్యక్రమంలో పద్మావతి ఖని మైన్ ఏజెంట్ బి.రవీందర్, డి.జి.యం. (పర్సనల్) గామలపాటి వెంకట మోహన్ రావు, మైన్ మేనేజర్ ఎం.వి.ఎన్ శ్యాం ప్రసాద్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మజ్జి మురళి, మైన్ సంక్షేమ అధికారి షేక్ షకీల్, సంబంధిత క్లర్క్ కొత్తపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 24 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతి మంగళవారం రైతులతో నేరుగా నిర్వహించే రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం మంగళ వారం మండలంలోని మూడు రైతువేదిక లలో నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్చువల్ గా రైతు భరోసాలబ్ధి పొందిన రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.రైతుభరోసావిజయోత్సవ లలో పాల్గొని రైతులతో నేరుగా మాట్లా డారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని మంత్రుల ప్రసంగా లను ఆసక్తిగా తిలకించారు.వ్యవసాయ పంటల సాగు వివరాలు,వరి పంట బోనస్ వివరాలు,రుణమాఫీపథకాలలబ్ధి గురించి వీడియో కాన్ఫరెన్స్ లో వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాల ద్వారా ప్రతి మంగళవారం వివిధ ముఖ్య శాస్త్రవేత్తల ద్వారా వివిధ పంటలపై మరియు క్షేత్ర స్థాయిలో రైతులకు పలుసాంకేతిక సల హాలు అందించడానికి ముఖ్యపాత్ర పోషి స్తుంది.ఎర్రుపాలెం,మీనవోలు,జమలా పురం రైతు వేదికలలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్లో తాసిల్దార్ మన్నె ఉషా శారద,ఆర్ఐ లు రవికుమార్,రాజశేఖర్, ఎంపీడీవో బి సురేందర్,ఏవో సాయి శివ, రెవిన్యూ సిబ్బంది,ఏఈవోలు బాలకృష్ణ వంశీకృష్ణ,గోపి,కృష్ణకుమారి,వెంకటేశ్వర్లు, సింధూర్,మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,కిషాన్ సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డి,మండల కాంగ్రెస్పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,చావా రామకృష్ణ,పంబి సాంబశివరావు,బొగ్గుల గోవర్ధన రెడ్డి,అనుమోలు వెంకట కృష్ణా రావు,రాజీవ్ గాంధీ,వేమిరెడ్డి అనురాధ, మొగిలిఅప్పారావు,కడియంశ్రీనివాసరావు,షేక్ ఇస్మాయిల్,లక్ష్మణరావు,కర్నాటి సుధాకర్ రెడ్డి,వెన్నపూస కృష్ణారెడ్డి,వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు నో చెప్పండి -సమాజాన్ని కాపాడండి

### టూ టౌన్ సీఐ ప్రతాప్




**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజం కలిసి రావాలని "ఇది ఒక వ్యక్తిని చంపడమే కాదు, సమాజంలోని అన్ని రకాల సమస్యలకు దారితీస్తుంది. డ్రగ్కు నో చెప్పడంలో యువత అప్రమత్తంగా బాధ్యతగా ఉండాలని టూ టౌన్ సీఐ ప్రతాప్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, డిఎస్పీ అబ్దుల్ రహమాన్ ఆదేశాల మేరకు టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ అలవాటుపడి యువత తమ మేధాశక్తిని వృథా చేసుకోకూడదన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని యూత్ సోషల్ స్టేటస్, ఫ్యాషన్గా ఎంచుకుంటోందని, దీనిద్వారా విలువైన జీవితాలు నష్టపోతారన్నారు. భవిష్యత్ లక్ష్యాలను ఎంచుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన సూచనలుపాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. స్కూళ్లు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకుంటున్నా, విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## మదకద్రవ్యాలు వాడకాన్ని అరికట్టాలి



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 24:** మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూని యర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలువాడడం వల్లజరిగేనష్టాలగురించి మంగళవారం మధిర రూరల్ సీఐ మధు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతోమాట్లా డుతూ మాదకద్రవ్యాలు వాడకంవల్ల జీవి తాలు నాశనం అవుతాయని అన్నారు. విద్యార్థులు తమ నివాస ప్రాంతాల్లో ప్రజ లను చైతన్య పరచాలన్నారు.ఈ కార్య క్రమంలో ఎర్రుపాలెం ఎస్సై రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది,కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాయిరామ్ ఏజెన్సీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు యండి.యాకూబ్ పాషా



**పాల్వంచ జూన్ 24 నవభూమి ప్రతినిది:** జిల్లాలో గల మైనారిటీ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కొరకు సాయిరాం ఏజెన్సీ ఇచ్చిన నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు యండి యాకూబ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ద్వారా కాంట్రాక్టు దక్కించుకున్న సాయిరాం ఏజెన్సీ వారు నిరుద్యోగుల నుండి దరఖాస్తులు స్వీకరించేందుకు శాశ్వత కార్యాలయాన్ని నేటి వరకు ఏర్పాటు చేయకుండా గత కొన్నేళ్లుగా పాల్వంచ లో ఏజెన్సీని నిర్వహిస్తూ అధికారులను మభ్యపెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలలో బోధన బోధనేతర సిబ్బంది ఉద్యోగాల నియామకాల కొరకు గురువారం నాడు ఓ దినపత్రికలో క్లాసిఫైడ్ ప్రకటన విడుదల చేసిందని, ఈ ప్రకటన నందు శాశ్వత చిరునామా లేకపోవటం, గడువు తేది రెండు రోజులు మాత్రమే ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తుందని అన్నారు. పత్రికలోని క్లాసిఫైడ్ ప్రకటన చూసిన జిల్లాలోని నిరుద్యోగులు తమ దరఖాస్తులను పూర్తి చేసుకొని క్లాసిఫైడ్ ప్రకటనలో ఉన్న ఫోన్ నెంబర్ కు సంప్రదించగా స్పందన లేకపోవడంతో తీవ్ర నిరాశ చెందారని ఆయన తెలిపారు. మిగతా జిల్లాలలో మాత్రం ఔట్సోర్సింగ్ ఉద్యోగాల కొరకు జిల్లా కలెక్టరేట్ లలోని ఆర్.యల్. సి కార్యాలయాలలో దరఖాస్తులు స్వీకరిస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం అందుకు భిన్నంగా ఏజెన్సీ వారు ఉధ్యోగ ప్రకటన విడుదల చేసారని అన్నారు. దీని కారణంగా అర్హులైన అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోలేక నిరాశ చెందారని , ఈ విషయంపై సంబంధిత అధికారులకు పిర్యాదు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు దృష్టి సారించి, సాయిరాం ఏజెన్సీ కాంట్రాక్టు రద్దుచేసి, మరలా నియామక ప్రకటన జారీ చేసి నిరుద్యోగులకు అండగా నిలవాలని కోరారు.

## అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే జారె

### కూలీలతో కలిసి నాట్లు వేసిన ఎమ్మెల్యే





**దమ్మపేట జూన్ 24 నవభూమి:** దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. మొత్తం రూ.3 కోట్లు 44 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో నిర్మితమైన సీసీ రోడ్లు పాఠశాలల ప్రహరీ గోడలు,త్రాగునీటి నూతన బోరు మోటార్లు, పైప్ లైన్లు హ్యాండ్ పంపులు తదితర పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు.సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సౌకర్యాలు ప్రజల ఇంటి ముంగిటికి చేర్చడానికి విశేషంగా కృషి చేస్తున్నానన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలకు మంచి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. ప్రభుత్వ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. తన పర్యటనలో భాగంగా మార్గ మద్యం లో వరి నాట్లు వేస్తున్న కూలీలను చూసి,ఆగి వారితో కలిసి వరి నాట్లు వేసి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. నాచారం లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్సై స్థాయికిశోర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి నేనుసైతం చేయూత కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మంచినీటి సౌకర్యార్థం కూలింగ్ వాటర్ క్యాన్లు ఉచితంగా అందించారు.

## సిపిఐ యువ నాయకుడికి ప్రసంశలు



**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** సుజాతనగర్ మండలానికి చిట్టచివరిగా ఉన్న గ్రామపంచాయతీ జామ్లతండా గ్రామంలో సమస్యలు సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తున్న గ్రామ యువ నాయకుడు, మాజీ వార్డు సభ్యులు, సిపిఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి బానోత్ అనిల్ నాయక్ ను మండలం కార్యదర్శి దత్రు, జిల్లా కావున్సిల్ జక్కుల రాములు, మాజీ ఎంపీటీసీ గణేష్ నాయక్, అంగోత్ రవీందర్, సుజాతనగర్ తహసిల్దార్ కృష్ణ ప్రసాద్, ప్రసంశించారు.

## విజయోత్సవాలు కాదు

# స్థానిక సంస్థల ఎన్నికల కోసం డ్రామాలు

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి ఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు




**మణుగూరు జూన్ 24 నవభూమి ప్రతినిధి:** గత వానకాలం రైతు భరోసా యాసంగిలో రైతు భరోసా ఎగ్గొట్టి ఓట్ల కోసం ఇప్పుడు విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం రైతులను మోసం చేయడమే నని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు.రైతులకు ఏం చేశావని సంబరాలు చేస్తున్నావ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు.రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా!కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా!రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా!రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా, అన్ని పంటలకు బోనస్ అని.. సన్నాలకే పరిమితం చేసినందుకా, 1200 కోట్ల బోనస్ డబ్బులు కూడా చెల్లించనందుకా,ప్రీమియం చెల్లించక రైతు బీమా అమలు ప్రశ్నార్థకం చేసినందుకు, పంట బీమా అని చెప్పి పంట బీమా యువనందుకా, ధాన్యం కొనుగోళ్ళు సక్రమంగా జరపనందుకా, వరంగల్ రైతు డిక్లరేషన్ ను అటకెక్కించినందుకా, మీ దుర్మార్గ పాలనలో 511 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా ఎందుకు సంబురాలు చేస్తున్నావు రేవంతూ? బిఆర్ఎస్ రైతు సంక్షేమ ప్రభుత్వం అయితే. కాంగ్రెస్ రైతు సంక్షోభ ప్రభుత్వం. కేసీఆర్ నాట్లకు నాట్లకు మధ్య రైతు బంధు ఇస్తే..మీరు ఓట్లకు ఓట్లకు మధ్య రైతు భరోసా ఇచ్చి మభ్య పెట్టాలని చూస్తున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న నీ జిమ్మిక్కులను రైతులు నమ్మరు అని ప్రభుత్వాన్ని సూటి ప్రశ్నలు వేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మాజీ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పత్తి సీజన్ నాటికి మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తా

### ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమానికి పెద్దపీట
### వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్



**జూలురుపాడు, జూన్ 24 (నవ భూమి ప్రతినిధి):** వచ్చే పత్తి సీజన్ నాటికి మండల కేంద్రంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తానని వైరా నియోజక వర్గ శాసన సభ్యులు మాళోతు రాందాస్ నాయక్ పునరుద్ఘాటించారు.మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన వివిధ కార్య క్రమాలలో పాల్గొని ప్రసంగించారు. రికార్డు స్థాయిలో తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రైతు భరోసా విజయోత్సవాలలో పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు బాణా సంచా కాల్చి,కేకు కోసి సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మంటపం లో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో పాల్గొని ప్రసంగించారు.రైతులకు రుణమాఫీ, రైతు భరోసా,భూ సమస్యల పరిష్కరించటానికి భూ భారతి రెవెన్యూ చట్టాన్ని తెచ్చి రైతుల పట్ల కాంగ్రెస్ ప్రజా పాలన చిత్తశుద్ధిని చాటుకుందని తెలిపారు.త్వరలోనే మండలానికి గోదావరి జలాలు రప్పించి భూములను సస్య శ్యామలం చేస్తానని స్పష్టం చేశారు.మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఇల్లు లేని అర్హులైన ప్రతివారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు కేటాయిస్తామని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం రోజుకు పద్దెనిమిది గంటలు కష్టపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గా నన్ను గెలిపించుట లో ప్రధాన పాత్ర పోషించిన మండల ప్రజానీకం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకతాటి పై నిలచి పార్టీని అగ్ర పథంలో నడిపించాలని కోరారు.అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. ఈ కార్య క్రమంలోఎం పి డి ఓ కరుణాకర్ రెడ్డి,ఎం పి ఓ తులసీ రాం,అన్ని శాఖల మండల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, అర్జున్ రావు,మంగిలాల్, కాళ్లూరి వెంకటేశ్వర రావు, హరీష్, దుద్దుకూరు మధు,వేల్పుల నరసింహారావు,అల్లాడి నరసింహా రావు,పొన్నేకంటి సతీష్,సుమంత్,గోపాల్ రెడ్డి,రోకటి సురేష్,నవీన్ రాథోడ్, చౌడం నరసింహా రావు,లచ్చూ,లాలు నాయక్, సపావట్ నరేష్,ప్రియాంక,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల కాలంలో పాతబాకాయిలకు జమ వద్దు

### బ్యాంకు మేనేజర్ కు సీపీఐ(ఎం) వినతి

**కారేపల్లి,నవభూమి, జూన్ 24:** రైతు పెట్టుబడికి రాష్ట్రం ప్రభుత్వం ఎకరాకు రూ. 6వేలు రైతు ఖాతలో జమ చేస్తే వాటిని బ్యాంకర్లు బకాయిల క్రింద జమ చేసుకుంటున్నారని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా రైతుభరోసా పైకాన్ని రైతులను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కారేపల్లి ఎస్‌బీఐ మేనేజర్ కళ్యాణికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా కొండెబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా విడుదల చేయటంతో రైతులు పెట్టుబడికి అసరాగా ఉంటుందని బ్యాంకులకు వెళ్లగా బ్యాంకర్లు రుణాలు రెన్యూవల్‌చేసుకోలేదని డబ్బులు ఇవ్వకుండా వెనుకకు పంపుతున్నారన్నారు. రైతు భరోసాతో పాటు పెన్షన్ పైకం, ఉపాధీ కూలీ పైకం, పంట నష్టపరిహార పైకాలు రైతులకు ఇవ్వకుండా బ్యాంకర్లు ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. రైతులు గతంలో మ్యాన్యూవల్ పహాణీపై రుణాలు తీసుకున్నారని ప్రస్తుతం అవి చెల్లక తప్పని సరిగా భూమి పాస్ పుస్తకాలుంటేనే రెన్యూవల్ చేస్తుండటంతో పేదల రుణాలు రెన్యూవల్‌కు నోచుకోవటం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరికి రుణమాఫీ చేస్తామని చెప్పటంతో రైతులు రుణాలు రెన్యూవల్ చేయలేదని మాఫీ సగంలోనే ఆపి వేయటంతో రుణాలు గడువుతీరిన బకాయిలుగా మారాయన్నారు. రుణమాఫీ కాక రుణాలు రెన్యూవల్ కాక వచ్చిన రైతు భరోసా పైకం చేతికి అందక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు భరోసా, పెన్షన్, ఉపాధి కూలీల పైకాలను హోల్డ్ నుండి తీసివేసి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు తలారి దేవప్రకాష్, వజ్జా రామారావు, ముండ్ల ఏకాంబరం, కల్తి భద్రయ్య, పాపినేని నాగేశ్వరరావు, సైదులు, సీతారాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు



# అంబరాన్ని అంటిన రైతు భరోసా సంబరాలు

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య ఆధ్వర్యంలో సంబరాలు





**అశ్వాపురం జూన్ 24 నవభూమి:** అశ్వాపురం మండల కేంద్రము లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య ఆధ్వర్యంలో రైతు భరోసా విజయోత్సవం కార్యక్రమాన్ని ఓరుగంటి వీరయ్య భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం అంటేనే రైతు రాజ్యం అని ఎన్నికల హామీలు ఇచ్చిన ప్రకారం రైతులకు సకాలంలో రైతు భరోసానివేసి కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ రాజ్యమని తెలియజేసింది. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన ఎంత రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల హామీలకి కట్టుబడి పనిచేస్తుందని ఏ ఒక్క హామీని కూడా విస్మరించబోదని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించి రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. టపాసులు కలుస్తూ, మిఠాయిలు తినిపిస్తూ ఎంతో సంబరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక సొసైటీ డైరెక్టర్ తుక్కని మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, తూము పెద్ద రాఘవులు, అవుల రవి, బచ్చు వెంకటరమణ, కొండ బత్తుల ఉపేందర్, యక్కటి సత్యనారాయణ రెడ్డి, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, సామకూరి వెంకన్న, భరాజు సంపత్, రావులపల్లి నరసింహ రావు, ఊకే రామయ్య, మాదినేని సుబ్బారావు, జానపాటి నాగేశ్వరావు, కిలారి శేషగిరిరావు, బద్రు, బండారు వెంకటేశ్వర్లు, కాక రాములు, చాప వెంకటేశ్వర్లు, కందుల లక్ష్మణ్, సబ్కా పిచ్చయ్య, కుంజ జాను, సజ్జ రమేష్, భూతం వెంకన్న, పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ కార్యాలయంలో రైతుభరోసా విజయోత్సవం



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 24:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తొలకరికి ముందే రైతు భరోసా నిధులను రైతుల ఎకౌంట్ లలో జమచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధా కర్ రెడ్డి పేర్కొన్నారు.పార్టీ ఆదేశాలమేరకు మంగళవారం మండలకాంగ్రెస్ పార్టీకార్యా లయంవద్ద ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ నాయకులు,కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూఏ రాష్ట్రంలో లేని విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినతరువాతఇచ్చినహామీలన్నీతూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు.తొమ్మిది రోజులవ్యవధిలోనే రైతులఖాతా లలో రైతు భరోసా డబ్బులు 9 వేల కోట్ల రూపాయలునగదు జమచేసిందని,1కోటి 49లక్షల39వేల111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో శీలం శ్రీనివాసరెడ్డి,అను మోలు కృష్ణారావు,తల్లపురెడ్డి నాగిరెడ్డి, చావా రామకృష్ణ,కడియం శ్రీనివాసరావు, బొగ్గులగోవర్ధన రెడ్డి,షేక్ ఇస్మాయిల్,పంబి సాంబశివ రావు,మల్లెల లక్ష్మణరావు, రాజీవ్ గాంధీ,బాబు రావు,పసుపులేటి వెంకటనారాయణ,సామినేని హనుమంత రావు,వెంకట్రామి రెడ్డి,నన్నపనేని రామా రావు,దేవరకొండ శ్రీను,నారాయణ,బానోత్ శ్రీను,దేవరకొండ రవి,కిషోర్ బాబు,తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో మదర్ థెరీసా కాలేజీ ప్రభంజనం

**భద్రాచలం జూలై 24 నవభూమి ప్రతినిధి:** కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన బీఈడీ ఫోర్త్ సిమ్ ఫలితాలలో భద్రాచలం మదర్ తెరిసా బిఈడి కాలేజ్ ప్రభంజనం సృష్టించింది. 50 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 50 మంది విద్యార్థులు ఫలితాలు సాధించారు. 100% రిజల్ట్ సాధించారు. ఇందులో 22 మంది డిస్టెంక్షన్, 28 మంది ప్రథమశ్రేణి ని ఉత్తీర్ణులయ్యారు. కాలేజ్ ప్రథమంగా యం.మల్లేశ్వరి 7. 66, బి. సంధ్య 7.66 ద్వితీయంగా జె. పావని. 7.54 తృతీయంగా, జె. సాంబ లక్ష్మి.7.47 వచ్చినారు. వీరిని మదర్ తెరిసా కాలేజీ కరస్పాండ్ తోట మల్ల ప్రభాకర్, తోట మల్ల వెంకటరమణ, ప్రిన్సిపాల్ విజయ్ మోహన్, లెక్చరర్ టి ఎస్ కే ధనలక్ష్మి, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించడం జరిగింది.

# రైతు భరోసా ప్రభుత్వ ఘన విజయం: ఎమ్మెల్యే జారె







**కొత్తగూడెం / దమ్మపేట జూన్ 24 నవభూమి:** రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా పథకం ద్వారా కేవలం 9 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో పూర్తి స్థాయిలో పెట్టుబడి సహాయం జమ చేయడం గర్వకారణమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఎమ్మెల్యే అధ్యక్షతన మంగళవారం అశ్వారావుపేట రైతు వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు భరోసా విజయోత్సవ వేడుకలు, రైతులతో ముఖాముఖి లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లా లో ఇప్పటి వరకు 1,76,236 మంది రైతులకు 305.09 కోట్లు అశ్వారావుపేట నియోజకవర్గ రైతులకు 45058 రైతులకు 81.39 కోట్లు జమ చేయడం జరిగింది అని తెలిపారు. కలెక్టర్ రైతుల కు బయోచార్ తయారీ,అజోల్లా పెంపకం,మునగ సాగు పై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే జారె ప్రధాన కూడలిలో నాయకులు అభిమానులు రైతులతో కలసి కాంగ్రెస్ నాయకుల చిత్రపటాలకు పాలబిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి కిషోర్, మున్సిపల్ కమిషనర్ సుజాత, సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్, తహసీల్దార్ రామకృష్ణ, టెక్నికల్ వ్యవసాయ అధికారి సాయి నారాయణ, మండల వ్యవసాయ అధికారి శివరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా అండతో ఇజ్రాయిల్ ఆగడాలు

## మానవ హక్కుల ఉల్లంఘన

### రాష్ట్ర మైనార్టీ కాంగ్రెస్ నాయకులు నయీమ్ ఖురేషి



**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** ప్రపంచ పోలీస్, అగ్రరాజ్యం అమెరికా అండ, ఆర్థిక, ఆయుధ చేయూత తో ఇజ్రాయిల్ఇరాన్, పాలాస్తిన వంటిదేశాలపై దాడులు చేస్తూ, యుద్ధ పీపాస తీర్చుకుంటోందని, మానవ హక్కుల హననానికి పాల్పడుతోందని రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి మంగళవారం ఓ పర్కటనలో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇరాన్ పై యుద్ధం ప్రారంభించిన ఇజ్రాయిల్ అంతర్జాతీయ నియమాలు ఉల్లంఘించిందన్నారు. కొన్నేళ్లగా పాలస్తీ న ఆక్రమణకు పాల్పడిన, అక్కడి పిల్లలను సైతం హతమారుస్తూ, మానవత్వం మర్చి పోయిందన్నారు. అమెరికా ఇజ్రాయిల్ మద్దతిస్తూ ఇతరులకు నీతులు బోధిస్తుందని ఎద్దేవా చేశారు. అమెరికా వక్ర నీతిని వదిలి, తన మిత్రుడు నేతన్యాహును అదుపులో పెట్టాలని హితవు చెప్పారు.

## కొత్తగూడెం ప్రాంత రైల్వే సమస్యలపై

### డిఆర్ఎంకు రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాసరెడ్డి వినతి







**కొత్తగూడెం జూన్ 24 నవభూమి ప్రతినిధి:** సికింద్రాబాద్ రైల్వే సంచాలన్ భవన్ లో మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డి. ఆర్. యు. సి. సి . సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ డి ఆర్ యు సి మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంత రైల్వే సమస్యలను పరిష్కరించాలని, కరోనాలో రద్దయిన రైళ్లన్నింటిని పునరుద్ధరించాలని, కాకతీయ రైలును మణుగూరు వరకు పొడిగించినడపాలని, బెల్గావి ఎక్స్ప్రెస్ ను తిరిగి నడపాలని, డోర్నకల్ నుండి కొత్తగూడెం వరకు జరుగుతున్న డబ్లింగ్ పనులను తక్షణమే పూర్తి చేసి కారేపల్లి, కొత్తగూడెంలో అదనంగా రైల్వే ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా మణుగూరు నుండి కొత్తగూడెం మీదుగా పుణ్యక్షేత్రాలైన తిరుపతికి, షిరిడి కి ప్రత్యేక రైలు నడపాలని అట్లాగే సింగరేణి మరియు కాకతీయ రైళ్లను పాత పద్ధతిలో అదనంగా భోగీలు ఏర్పాటు చేసి స్లీపర్ కోచ్ తో పాటు ఏసీ బోగీలు కూడా ఏర్పాటు చేసి ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. కొత్తగూడెం నుండి కొవ్వూరు వరకు రైల్వే లైన్ ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేసి కొత్తగూడెం కేంద్రంగా రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలని, అమృత భారత్ కింద నిర్మిస్తున్న కొత్తగూడెం రైల్వే స్టేషన్ తో పాటు ఖమ్మం మధిర రైల్వే స్టేషన్ త్వరగా పూర్తిచేసి ప్రజలకు ప్రయాణికులకు అన్ని విధాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతూ.. సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ బర్తేష్ కుమార్ జైనీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ త్వరలోనే మణుగూరు టు కొత్తగూడెం మీదుగా తిరుపతికి షిరిడీకి ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తామని, రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయిస్తామని రైల్వే సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ ఏడిఆర్ఎం డాక్టర్ ఆర్. గోపాలకృష్ణ న్, సీనియర్ డిసిఎం సిపాలి కుమార్, సీనియర్ డివోఎం డాక్టర్ ఎ సురేష్ రెడ్డి, డీసీఎం బి. చరణ్ నాయక్ ,మరియు గూడ్స్ డీసీఎం విశాల్ అర్జున్, తదితర అధికారులతో పాటు డి ఆర్ యు సి సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై టాస్క్ పోర్స్ సమావేశం



**ఎర్రుపాలెం,నవభూమి,జూన్ 24:** బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తహశీల్దారు ఉషా శారద,ఎంపీడీవో బి సురేందర్, ఎంపీఓ శ్రీలక్ష్మి,ఎంఈఓ మురళీ మోహన్, ఏసిడిపిఓ కృష్ణశ్రీ పాల్గొని డయేరియాపై కాంపెయిన్ ప్రోగ్రాంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.వైద్య సిబ్బంది 0–5 సంవత్సరాలవయస్సుగల పిల్లలంద రినీ సర్వే ద్వారా గుర్తించి వారిలో డయే రియా బారిన పడిన వారికి ఓఆర్ఎస్ ద్రావణం,జింక్ మాత్రలు అందించడం, మిగతా వారికి అవగాహన కల్పించడం చేయాలన్నారు.మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రజలు ప్రస్తుతం వర్షాకాలం కనుక పరిశుభ్రతను పాటించా లని,ఈగలు,దోమలు వ్యాప్తి చెందకుండా తమపరిసరాలుపరిశుభ్రంగా ఉంచుకోవా లని వివరించారు.

# రైతన్నను రాజును చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

### పెద్ద ఎత్తున రైతు భరోసా సంబరాలు





**మణుగూరు జూన్ 24 నవభూమి ప్రతినిధి:**ఇది మాటల పాలన కాదు ఇది రైతుల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వ పాలనవిత్తనాల నుంచీ విక్రయాల వరకు రైతుకి తోడుగా కాంగ్రెస్ పంట పండించేది రైతు, భరోసా ఇచ్చేది కాంగ్రెస్, రైతు రాజ్యమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం.పెద్ద ఎత్తున రైతు భరోసా సంబరాలు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గుట్ట మల్లారం రైతు వేదిక కేంద్రంలోని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ నెల 16వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు విడుదల చేసి ఒక కోటీ 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా నిధులు 100% పూర్తి అయిన సందర్భంగా రైతు భరోసా సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టడం హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారన్నారు. అనంతరం మాట్లాడుతూరైతన్నలకు భరోసాగా రైతుల పక్షపాతి కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతన్నలను రాజులు చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు. గత ప్రభుత్వాలు లాగా మాటల పాలన కాదు, ఇది రైతుల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వ పాలన అని ఆయన తెలిపారు..విత్తనాల నుంచి విక్రయాల వరకు రైతుకు తోడుగా ఉంటూ పంట పండించడానికి పండిన పంట కొనడానికి రైతులకు భరోసాగా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నిలుస్తుంది అన్నారు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకొని రైతు రాజ్యమే ధ్యేయంగా ముందుకు సాగుతూ రైతుల బాగుపై ప్రత్యేక దృష్టిసారించి ఉచిత విద్యుత్ పంట మద్దతు ధర, ఇన్పుట్ సబ్సిడీలు, పంట నష్టపరిహారం, సన్న రకం ధాన్యానికి క్వింటాకు 500 రూ బోనస్, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తూ అలాగే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూ లకు గ్యాస్ సిలిండర్, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, పిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలు అమలు చేస్తుంది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఇది కార్పొరేట్ పాలన కాదు, ఇది రైతన్నల, కార్మికుల, నిరుద్యోగ యువత, గిరిజనుల, మహిళల ప్రభుత్వం అని, ప్రతి పథకము ప్రతి రూపాయి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా ఉంటుందని ఆయన చెప్పారు. రైతు నేస్తం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు ఏడి ఈ తాతారావు, ఏఈఓ లక్ష్మణరావు, రెవిన్యూ డిపార్ట్మెంట్ అద్దంకి నరేష్, ఎండిఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో పల్నాటి వెంకటేశ్వరరావు, రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు